

నాగచైతన్య

'తండేల్'గా కొత్త నాగచైతన్యను చూస్తారు

14ఏండ్ల కెరీర్.. విభిన్నమైన పాత్రలు.. అద్భుత విజయాలు.. ఇదీ అక్కినేని నాగచైతన్య ట్రాక్ రికార్డ్. తాతకు తగ్గ మనవడిగా, తండ్రికి తగ్గ కొడుకుగా అప్రతిహతంగా కెరీర్‌ను కొనసాగిస్తున్నారు నాగచైతన్య. వెండితెరపై హీరోగా తనదైన ముద్ర వేసిన చైతూ, త్వరలో 'దూత' వెబ్‌సిరీస్ ద్వారా ఓటీటీలో కనిపించనున్నారు. అలాగే చందు మొండేటి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్‌సంస్థ నిర్మించనున్న 'తండేల్' చిత్రంలో కథానాయకుడిగా మెరవనున్నారు. నేడు నాగచైతన్య పుట్టినరోజు. ఈ సందర్భంగా విలేకరులతో చైతూ చిట్‌చాట్..

అందుకే ఏ సర్టిఫికెట్ ఇచ్చారు

'దూత' సూపర్‌నాచురల్ థ్రిల్లర్. దర్శకుడు విక్రమ్ కె.కుమార్ కథ చెప్పగానే థ్రిల్ ఫీలయ్యాను. చాలా కొత్తగా అనిపించింది. ఈ వెబ్ రిసీస్‌లో కథానుగుణంగా బ్లడ్ ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే సెన్సార్ ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. అంతేతప్ప ఇబ్బందిపడే సన్నివేశాలేం ఉండవు. ఇంటిల్లిపాదీ హాయిగా చూడొచ్చు. సూపర్‌నాచురల్ థ్రిల్లర్స్ తీయడంలో విక్రమ్ దిట్ట. ఆయన తీసిన '13ఏ', మా సంస్థలో చేసిన 'మనం' రెండూసూపర్ నాచురల్ కథలే. వాటిని మించేలా ఈ సిరీస్ ఉంటుంది.

అరవింద్ ఈ కథను బాగా నమ్మారు

చందు మొండేటి దర్శకత్వంలో చేయనున్న 'తండేల్' చిత్రం పేరుకు తగ్గట్టే కొత్త కథ. బెస్తవాళ్లలో నాయకుడ్ని 'తండేల్' అంటారు. అందుకు తగ్గట్టుగానే నా కేరక్టరైజేషన్ ఉంటుంది. అందుకే ఆ పాత్ర కోసం జిమ్‌లో నెలలు తరబడి కష్టపడ్డాను. వాస్తవసంఘటనల ఆధారంగా తెరకెక్కనున్న ప్రేమకథ ఇది. కథ వినగానే గొప్ప సినిమా అవుతుంది అనిపించింది. అల్లు అరవింద్ కూడా ఈ కథను బాగా నమ్మారు. ఆయన జడ్జిమెంట్ తెలిసిందేగా. కథ సగం ఇండియాలో సగం పాకిస్తాన్‌లో జరుగుతుంది. 'లవ్‌స్టోరీ' తర్వాత సాయిపల్లవి నేనూ కలిసి నటిస్తున్నాం. ఇందులో తనది ఇంపార్టెంట్ కేరక్టర్. ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడంతో ఈ కథకు మరింత బలం చేకూరినట్టయ్యింది.

అదే నా ఆశ.. ఆశయం

'తండేల్'లో శ్రీకాకుళం యాస మాట్లాడతాను. ఇందులో నా బాడీ లాంగ్వేజ్‌నీ, డైలాగ్ డిక్షన్‌నీ కొత్తగా డిజైన్ చేశాడు దర్శకుడు చందు. తను అనుకున్నట్టు ఆవిష్కరించడానికి సర్వం సిద్ధం చేసుకున్నాడు. డిసెంబర్ నుంచి మూడు నెలలపాటు రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ప్రేమకథలకు ఇన్నాళ్లూ దూరమ్యాను. ఆ లోటు ఈ సినిమా భర్తీ చేయనుంది. ఈ సినిమా తర్వాత శివ నిర్వాణ దర్శకత్వంలో సినిమా ఉంటుంది. నటుడిగా ఇంకా గొప్ప పాత్రలు చేసి, ఇంటిపేరును నిలబెట్టాలనేది నా ఆశ.. ఆశయం..

ఆ వార్తలో నిజంలేదు

వెబ్ మీడియా, సోషల్‌మీడియా పెరిగాక, వీటి వేదికగా లేనిపోనివి కల్పించుకొని రాయడం చాలామందికి పరిపాటైపోయింది. ప్రతి విషయాన్నీ బూతద్దం చూసి రాసేస్తున్నారు. రవితేజ, మలినేని గోపీచంద్‌ల సినిమా విషయంలో ఇప్పుడు ఇలాంటి వార్తే మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. బ్లాక్‌బాస్టర్ 'క్రాక్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. స్క్రిప్ట్ వర్క్ కూడా దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమాకు సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్న విషయం విదితమే. ఇదిలా వుంటే ఈ సినిమాకు ప్రస్తుతం బ్రేక్ పడిందని, బడ్జెట్ ఎక్కువ అవ్వడంచేత మైత్రీమూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించలేమని చేతులెత్తేశారని ఉన్నవీ లేనివీ కల్పించుకొని రాసేస్తున్నాయి కొన్ని వెబ్‌సైట్లు. నిజానికి ఆ వార్తలో నిజం లేదు. ఆ సినిమాకు సంబంధించి స్క్రిప్ట్‌వర్క్‌లో మలినేని గోపీచంద్, సాయిమాధవ్‌బుర్రా బిజీగా ఉన్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌కి వెళ్లనుంది. ఇందులో రవితేజ పాత్ర 'క్రాక్'ని మించే అత్యంత శక్తిమంతంగా ఉంటుందని విశ్వసనీయసమాచారం.

రవితేజ

కిల్లర్.. కిల్లర్ కెప్టెన్ మిల్లర్..

1930 నుంచి 1940 మధ్య కాలంలో జరిగిన కథాంశంతో జాతీయ ఉత్తమనటుడు ధనుష్ నటిస్తున్న పీరియడ్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్' అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. టి.శరవణన్, సాయిసిద్ధార్థ్ నిర్మాతలు. సంక్రాంతి కానుకగా పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకోసం జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచిన 'కిల్లర్.. కిల్లర్' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రాకేందుమౌళి రాసిన ఈ పాటను గాయకుడు హేమచంద్రతో కలిసి ధనుష్ స్వయంగా పాడారు. ఈ పాట, దానికి సంబంధించిన విజువల్స్ అద్భుతం అనిపించేలా ఉన్నాయని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో డాక్టర్ శివరాజ్‌కుమార్, సందీప్‌కిషన్ ప్రత్యేక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ నుని.

ధనుష్

నితిన్, శ్రీలీల

ఎక్స్‌ట్రార్డినరీ మాస్ జాతర

'ఎక్స్‌ట్రా – ఆర్డినరీ మ్యాన్'గా నితిన్ రానున్నాడు. శ్రీలీల కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. ఎన్.సుధాకర్ రెడ్డి, నికితారెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం శంషాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో మూడొందలమంది ఫారిన్ డాన్సర్లతో జానీ మాస్టర్ నేతృత్వంలో పక్కా మాస్ సాంగ్‌ను శ్రీలీల, నితిన్‌లపై చిత్రీకరిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ' ఇప్పటికే విడుదలైన 'డేంజర్ పిల్లా..', 'బ్రష్ వేస్కో..' పాటలకు అద్భుతమైన స్పందన వస్తున్నది. ఇటీవల విడుదలైన టీజర్ కూడా అమేజింగ్‌గా ఉందంటున్నారు. కథ, నితిన్ కేరక్టరైజేషన్ ఈ సినిమాకు ప్రధాన బలాలు. ఈ కథకు జూనియర్ ఆర్టిస్టే హీరో. సినిమాల్లో నటించే జూనియర్ ఆర్టిస్ట్‌గా ఇందులో నితిన్ కనిపిస్తాడు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పాటతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. డిసెంబర్ 8న సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. డా.రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో సుధేవ్ నాయర్, రావు రమేశ్, రోహిణి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: హేరిస్ జయరాజ్.

వాళ్ల ప్రశ్నలు ఇరిటేషన్ తెప్పిస్తాయ్

'ఈ ఫోన్ల వల్ల మనశ్శాంతి దూరమవుతున్నది. నా చిన్నతనంలో ఈ ఫోన్ల వాడకం తక్కువ. అప్పుడు ఏ బాధా లేకుండా ప్రశాంతంగా బతికాం. ఇప్పుడు ఫోన్ శరీరంలో భాగం అయిపోయింది. అది లేకపోతే బతకలేని పరిస్థితి. కానీ అందులో వస్తున్న వీడియోలు, మెసేజ్‌లు ప్రతికూలతను కలిగిస్తున్నాయి. అవి మనుషులను మానసిక బలహీనుల్ని చేస్తున్నాయి. అందుకే నా వ్యక్తిగత సోషల్ మీడియా నుంచి కొన్ని పేజీలను ఆన్‌ఫాలో చేశాను. ఇంకా చేస్తూనే వున్నాను' అని చెప్పింది అనన్య పాండే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య పై విషయాలను ప్రస్తావించింది. 'సెలబ్రిటీని కావడం చేత నా చుట్టూ ఎప్పుడూ అభిమానులు ఉంటారు. ఈ సోషల్‌మీడియాలో వచ్చే పుకార్లనే వాళ్లంతా ప్రశ్నలుగా సంధిస్తుంటారు. నాకు ఇరిటేషన్ వచ్చేస్తుంటుంది. అందుకే.. సాధ్యమైనంతవరకూ ఒంటరిగా బతకటానికి ప్రయత్నిస్తున్నా. నా గురించి నేను ఆలోచించుకునే అవకాశం అప్పుడే కదా ఉండేది' అంటూ చెప్పుకొచ్చింది అనన్య.

అనన్య పాండే

కన్నప్ప సాహసం

మంచు విష్ణు

తెలుగులో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'కన్నప్ప' ఒకటి. మహాపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా ఈ సినిమా రూపొందుతున్నది. ఇందులో కన్నప్పగా మంచు విష్ణు నటిస్తున్నారు. గతంలో ఈ పాత్రను కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, రెబల్‌స్టార్ కృష్ణంరాజు పోషించి మెప్పించారు. ఇప్పుడు మంచు విష్ణు పోషిస్తున్నారు. ఇది ఓ విధంగా సాహసమే. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్ ఇలా పెద్ద పెద్ద స్టార్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఈ చిత్రం షూటింగ్ న్యూజిలాండ్‌లో శరవేగంగా జరుగుతున్నది. పాన్‌ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాత మోహన్‌బాబు భావిస్తున్నట్టు సమాచారం. ముఖేశ్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకుడు. నేడు మంచు విష్ణు పుట్టిన రోజు. లొకేషన్లో ఘనంగా ఆయన బర్త్‌డే వేడుక జరుగనున్నట్టు సమాచారం.

నయనతార

పదికోట్ల పారితోషికం?

హీరోయిన్ల పారితోషికం అయిదుకోట్లంటే ఎక్కువ. కానీ అమాంతం పదికోట్ల స్థాయికి హీరోయిన్ల రెమ్యునరేషన్‌ని తీసుకెళ్లిపోయింది నయనతార. ప్రస్తుతం చేస్తున్న 'అన్నపూరణి' నయనతార చేస్తున్న 75వ సినిమా. ఈ సినిమా తర్వాత నయన్ ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమా చేయనున్నారు. అరుణ్‌రాజా కామరాజ్ ఈ చిత్రానికి దర్శకుడు. ప్రిన్స్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రానికి గాను నయన్ పదికోట్ల పారితోషికాన్ని డిమాండ్ చేసినట్టు సమాచారం. నిర్మాతలు కూడా అంగీకరించారని వినికిడి. ఇది ఓ విధంగా కథానాయికల పారితోషికాల విషయంలో సొంతిండియా రికార్డ్. ఓ వైపు వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ, తల్లిగా బిడ్డల ఆలనాపాలనా చూసుకుంటూ, మరోవైపు సూపర్‌స్టార్‌గా తన స్థాయిని పెంచుకుంటూ కెరీర్‌లో దూసుకుపోతున్నది నయన్. వంద చిత్రాలను పూర్తి చేయాలనేది తన టార్గెట్ అని ఇటీవలే ఓ సందర్భంలో చెప్పింది తను. ఆమె స్పీడ్ చూస్తుంటే టార్గెట్ త్వరగానే రీచ్ అయ్యేలా వుంది.

ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు

రమ్యప్రియ, సూపర్ రాజా

'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు'.. అనే పేరుతో ఓ సినిమా రానున్నది. సూపర్ రాజా స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించారు. రమ్యప్రియ, వంశీ గోనె ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రం టైటిల్ లాంచ్ వీడియోను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఒకే షాట్‌లో రెండు గంటల సినిమా తీశామని, సినిమాలో దాదాపు పదిహేను వందల డైలాగులు బ్రేక్ లేకుండా చెప్పామని దీనికోసం పాత్రధారులందరం ఏడునెలలు విరామం లేకుండా రిహార్సిల్స్ చేశామని, ఓ వైపు ఒకే షాట్లో యాక్ట్ చేస్తూ, మరో వైపు డైరెక్ట్ చేయడం జరిగిందని, ఎన్నో అడ్డంకులను అధిగమించి సినిమాను పూర్తి చేశామని సూపర్‌రాజా చెప్పారు. సాంకేతికంగా కూడా సినిమా అద్భుతంగా ఉంటుందని, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని ఆయన అన్నారు. ఇంకా చిత్ర తారాగణమంతా మాట్లాడారు.

ఆ స్పార్క్ కట్టిపడేస్తుంది

శర్వానంద్ 'రన్ రజా రన్'లో తళుక్కున మెరిసిన తార సీరత్ కపూర్. ఆ తర్వాత కూడా తెలుగులో కొన్ని సినిమాలు చేసింది తను. రీసెంట్‌గా అల్లు అర్జున్‌తో ఈ అమ్మడు దిగిన ఫొటో నెట్టింగ్ వైరల్ అయ్యింది. దాంతో సీరత్ త్వరలో బన్నీతో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. దానికి తగ్గట్టే 'పుష్ప2'లో సీరత్ ఓ ఐటమ్ సాంగ్‌లో నర్తించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ వార్తకు బలాన్నిస్తూ రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో బన్నీ గురించి ఆసక్తికర వ్యాఖ్యాలు చేసింది సీరత్. 'లైఫ్‌లో మనకు చాలామంది తారసపడుతుంటారు. వాళ్లల్లో కొందరి లక్షణాలు మనల్ని ఆకర్షిస్తుంటాయి. అలా నన్ను ఆకర్షించిన వ్యక్తి బన్నీ. తనలో ఓ స్పార్క్ ఉంటుంది. అది ఎవరినైనా కట్టిపడేస్తుంది. బన్నీ గురించి వ్యక్తిగతంగా తెలుసుకునే అవకాశం కొందరికే వస్తుంది. ఆ కొందరిలో నేనూ ఉన్నాను. స్టార్ అయివుండి కూడా ఎంతో వినయంగా ఉంటాడు. అతనితో ఉన్నవాళ్లను సొంత మనుషుల్లా చూసుకుంటాడు. తనతో కలిసి పనిచేసే రోజుకోసం ఎదురుచూస్తున్నాను' అంటూ మనసుని ఆవిష్కరించింది సీరత్.

సీరత్ కపూర్

షకలక శంకర్, రాజీవ్ కనకాల

అన్నాదమ్ముల అనుబంధం

రాజీవ్ కనకాల, షకలక శంకర్, శ్రీతేజ్, అక్సాఖాన్, రూపిక ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకుడు. ఎడవెల్లి వెంకట్‌రెడ్డి నిర్మాత. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి సంబంధించిన 'అన్నదమ్ములను..' అంటూ సాగే పాటను సునీల్, సత్యంరాజేశ్, కోనవెంకట్, నిర్మాత ఎస్.గోపాల్‌రెడ్డి కలిసి విడుదల చేశారు. పాట బావుందని, సినిమా కూడా మంచి విజయం సాధించాలని వారందరూ ఆకాంక్షించారు. అన్నదమ్ముల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా ఈ చిత్రం తెరకెక్కిందని, అందరికీ నచ్చే సినిమా ఇదని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: హరిగౌర, కెమెరా: మెంటం సతీశ్.